


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## స్నేహితుడు

**ఫోన్ మోగింది**. చిరాగ్గా ఉన్న ఆనంద్ డిస్‌ప్లే అయ్యే పేరు చూసి అయిష్టంగా ఆన్సర్ చేసాడు.

"ఆనందూ. ఈ సాయంత్రం ఫ్రీయేనా?" అవతలనించి మహేష్ కంఠం వినిపించింది.

"ఎందుకు?" కొట్టినట్లుగా అడిగాడు.

"నా ఫ్రెండ్ ఒకడు ఆర్మీలో మేజర్‌గా చేస్తున్నాడు. ఎక్కడో అస్సాంలో. వాడు హైదరాబాద్ లో వారం రోజులు ఆఫీస్ పని ఉండి వచ్చాడు. నిన్నటితో అయిపోయింది. రేపు వెళ్ళిపోతాడు. ఫ్రెండ్స్‌తో హేంగవుట్ అవుదామని వాడి ఆశ. నాకు ఫోన్ చేసి, నీ ఫ్రెండ్స్ నా ఫ్రెండ్సే కదరా కుదిరితే తీసుకురా అన్నాడు. నేనూ ఎక్కువమందిని పిలవదల్చుకోలేదు. రాజర్షి, నువ్వూ, నేనూ అంతే. వస్తావా? మిలటరీ సరుకు తాగచ్చు."

విసుగ్గా ఉండటంతో ఆనంద్ ఓ క్షణం తటపటాయించి చెప్పాడు.

"సరే. ఎక్కడికి రావాలి?"

మహేష్ అడ్రస్ చెప్పి ఫోన్ పెట్టేశాడు.

ఆనంద్ బెడ్రూములోకి వెళ్ళి పేంట్, షర్ట్ తీసుకుంటూ మంచంమీద  పడుకుని ఏడుస్తున్న భార్యవంక నిరసనగా చూసాడు. తయారై తలుపు చప్పుడయ్యేలా వేసి బయటకి నడిచాడు.

ఆనంద్ ఓ ఇండిపెండెంట్ బంగ్లా ముందు బైక్ ఆపి మహేష్‌కి ఫోన్ చేసాడు.

"వచ్చేసావా? గేట్ తీసే ఉంది. లోపలకి వచ్చి బంగ్లా వెనక్కి రా. నేను వస్తున్నాలే"  మహేష్ చెప్పాడు.

ఆనంద్ బైక్ తాళం వేసి గేట్ తెరచుకుని లోపలకి వెళ్ళి ఆ భవంతి పక్కనే ఉన్న బాట మీద వెనక్కి వెళ్ళాడు. మహేష్ అతన్ని ఆలింగనం చేసుకుని 'రా అటు వైపు. ఇది మా వాడి ఫ్రెండ్ ఇల్లే' చెప్పాడు.

అక్కడ ఓ డెక్ మీద మార్బుల్‌తో చేసిన పర్మినెంట్ టేబుల్, దాని ముందు ఆరు పేము కుర్చీలు వేసి ఉన్నాయి.

రాజర్షి అప్పటికే వచ్చేసాడు.

దాదాపు వారి వయసే ఉన్న ఒకతను ఆనంద్‌ని చూసి ఆప్యాయంగా నవ్వి కరచాలనం చేసి చెప్పాడు.

"నేనెవరో తెలియకపోయినా వచ్చినందుకు థాంక్స్"

"నేను చెప్పింది వీడి గురించే ఆనందూ. నా ఫ్రెండ్ శిరోమణి. ఆర్మీలో మేజర్" మహేష్ పరిచయం చేసాడు.

ఆ పేరు వినగానే ఆనంద్ అప్రయత్నంగా అతని చెయ్యి వదిలేసాడు. అదేమీ గమనించని శిరోమణి మహేష్‌ని అడిగాడు.

"ఇంకా ఎవరైనా మిత్రులు వస్తారా?"

"లేదురా. మంది ఎక్కువైతే మందు పలచన అవుతుందని నా బెస్ట్ ఫ్రెండ్స్‌ని మాత్రమే పిలిచా" మహేష్ నవ్వుతూ చెప్పాడు.

తర్వాత టేబుల్ మీదున్న గ్లాసుల్లో రమ్ పోసి, సోడా కలిపి నలుగురికీ ఇచ్చాడు.

ఓ సిప్ తాగాక శిరోమణి చెప్పాడు.

"ఆర్మీలో రిక్రూటైనప్పటినించి బార్డర్స్‌లో తప్ప ఊళ్ళల్లో ఎప్పుడూ లేను. తెలుగు మాట్లాడే వాళ్ళుంటే ప్రాణం లేచొస్తుంది."

"మీరు మాలాగా బేంకో, సాఫ్ట్ వేరో కాకుండా మిలటరీలో చేరాలని ఎందుకనుకున్నారు? దేశభక్తా?" రాజర్షి అడిగాడు.

శిరోమణి కురచగా ఉన్న తన జుట్టుని ఓసారి నిమురుకుని నవ్వాడు. ఓ నిమిషం తర్వాత చెప్పాడు.

"అదో పెద్ద కథ."

"నాకు కథలంటే చాలా ఇష్టం. మీకు అభ్యంతరం లేకపోతే చెప్తారా? రాజర్షి అడిగాడు.

"విషాద గాథలు కూడానా?" శిరోమణి అడిగాడు.

ఆనంద్ నిటారుగా కూర్చున్నాడు.

"నా ఫ్రెండ్స్ నీ ఫ్రెండ్సేగా మణీ. నిజానికి నాకూ తెలీదు. నేను ఇంటర్మీడియెట్ అవగానే ఐ ఐ టి చెన్నైకి వెళ్ళిపోయాను. చెప్పగల విషయమైతే చెప్పు" మహేష్ ఆసక్తిగా అడిగాడు.

శిరోమణి గ్లాస్‌లో సోడా కలుపుకుని చెప్పాడు.

"ప్రేమ."

"ప్రేమ?" రాజర్షి అయోమయంగా అడిగాడు.

"అవును. నేను ఆర్మీలో చేరడానికి కారణం ప్రేమ."

"ప్రేమంటే అమ్మాయా? లవ్వా? దేశ భక్తా?" మహేష్ అడిగాడు.

శిరోమణి నవ్వాడు.

"నా తెలుగు మరీ అంత అధ్వానమైపోయిందా? లవ్, ఓడిపోయిన ప్రేమ"

"అయ్యో" రాజర్షి సానుభూతిగా చెప్పాడు.

"అదో దివ్యమైన ప్రేమ" శిరోమణి చెప్పాడు.

"సూటిగా చెపితే వింటాం. చెప్పాక దివ్యమో కాదో చెప్తాం. ఉపమానాలే తప్ప విషయానికి రావేంటిరా?" మహేష్ కసిరాడు.

"అదో పెద్ద కథ."

"అదిగో మళ్ళీ. ఓకే. టాపిక్ మార్చేద్దాం" మహేష్ విసుగ్గా చెప్పాడు.

"ఆయన్ని చెప్పనివ్వచ్చుగా? డిస్టర్బ్ చేయకు" ఆనంద్ విసుక్కున్నాడు.

"సరే. సరే సూటిగా చెపుతా" శిరోమణి ఒప్పుకున్నాడు.

మహేష్ మరోసారి గ్లాసులు నింపాలా అని చూసాడు కాని అన్నీ నిండుగా ఉన్నాయి.

"తన పేరు మనోరమ. రాణీ మనోరమ. అంతా రాణి అనేవాళ్ళు. నేను మాత్రం రవీంద్రనాథ్ టాగోర్‌లా నోరా అని పిలిచేవాడిని" శిరోమణి కళ్ళు మూసుకుని ఆమె రూపాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ చెప్పాడు.

"నోరా మనిషికాదు. దేవత. దేవలోకంలో ఏదో చిన్న తప్పు చేసి శాపవశాత్తూ మా ఊళ్ళో మాపక్కింట్లో పుట్టింది. ప్రస్తుతం ఆ దేవతని ఏ గంధర్వుడు తన అరచేతులమీద నడిపిస్తున్నాడో తెలీదుకాని, మా పెళ్ళయి ఉంటే, నోరాని ఎంత ప్రేమగా చూసుకునేవాడినో. చిన్నప్పటినించి మనోరమ ఎంత మంచమ్మాయో. వాళ్ళ తమ్ముడు, చెల్లెలు కన్నింగ్. వాళ్ళు చేసిన పాడు పనులన్నీ అక్క చేసిందని చెప్పేవారు. అమ్మా నాన్నలతో పాపం నోరాకి ఎప్పుడూ చివాట్లే. నాకు కోపం వచ్చి అడిగేవాడిని. 'మీ చెల్లి పేరెందుకు చెప్పవు?' అని.నవ్వేసి, 'పాపం చిన్నపిల్ల తిడతారని భయమేసి నా పేరు చెప్పిందంతే ' అనేది."

"ఉపమానాలు వద్దు గురూ మొదట్నించీ కథలాగా చెప్పు" మహేష్ కోరాడు.

శిరోమణి నవ్వి క్షమాపణగా చెప్పాడు.

"నోరా ఎప్పుడు గుర్తొచ్చినా కొంచెం ఎమోషనల్ అవుతాను. సారీ. కథలాగే చెప్తాను. రాణీ మనోరమ, నేను పక్క పక్క ఇళ్ళల్లో పెరిగాం. నాకంటే తను మూడేళ్ళు చిన్న. తను బేబీగా ఉన్నప్పటినించి నాకెంత ప్రేమో, వాళ్ళమ్మ తనకి స్నానం చేయించి చాపమీద పడుకోపెట్టి, నన్ను చూస్తుండమని తను ఇంటి పనులు చేసుకునేది. గులాబిపువ్వులాంటి ఆ పాపని చూస్తూ అక్కడే కూర్చునేవాడిని. మా అమ్మ పదిసార్లు పిలిచాక అయిష్టంగా లేచి వెళ్ళేవాడిని. తనని స్కూల్‌కి కూడా నేనే తీసుకెళ్ళాను. నా చెయ్యి పట్టుకుని నడిచేది. విషాదం ఏమిటంటే, పెద్దయ్యాక నోరా నన్ను చిటికెన వేలిని కూడా తాకనివ్వలేదు. నేను చాలా హర్ట్ అయ్యాను. అప్పుడు నేను టెంత్ చదువుతున్నాను. తను సెవెంత్‌లో ఉంది. ఓ రోజు మా పెరట్లో కూర్చున్నప్పుడు గట్టిగా అడిగాను. నన్నెందుకు దూరం పెడుతున్నావని. వాళ్ళ నాయనమ్మ ఇక మీదట మగపిల్లలతో మాట్లాడడం వాళ్ళని తాకడం, తాకనివ్వడం చేయకూడదని చెప్పిందిట. నాతో మాట్లాడకుండా ఉండలేదు కాబట్టి అదొక్క మాట వినను అందట. నాకెంత కోపం వచ్చిందో. పెద్దరాయి తీసుకుని ఆ ముసలావిడ తల పగలగొట్టాలనిపించింది" శిరోమణి ఆగాడు.

దీక్షగా వింటున్న ఆనంద్ రమ్ గ్లాస్‌లోకి చూస్తూ మౌనంగా కూర్చున్నాడు.

"ఆపారేం? చెప్పండి" రాజర్షి ఆత్రంగా అడిగాడు.

"మేం దూరంగా నడుస్తూ మాటలు చెప్పుకునేవాళ్ళం. ఇంటర్ సెకండియర్‌లో ఉన్నప్పుడు తనతో చెప్పాను 'నోరా ఐ లవ్ యూ. సినిమాల్లో ప్రేమికులు ఎంచక్కా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతారు. నువ్వు మాత్రం నన్ను అంటరానివాడిగా చూస్తున్నావు. దానికి నోరా నవ్వింది కాని జవాబు చెప్పలేదు. వాళ్ళ నాయనమ్మ రాక్షసి చెప్పిన హితబోధ తనలో లోతుగా నాటుకుంది. మా ప్రేమ కబుర్లు కూడా శృతిమించనివ్వలేదు.

'అలాంటివన్నీ పెళ్ళయ్యాక. ఇప్పుడు వద్దు 'అనేది. ఈ కాలం పిల్లల్ని చూస్తూంటే నిజంగా నోరా ఎంత బంగారు తల్లో అనిపిస్తుంది. నాకు యం.సెట్‌లో చాలా పెద్ద రేంక్ వచ్చింది. మా జిల్లాలోనే సీట్ వచ్చే ప్రసక్తి లేదు. మా బాబాయ్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో సీట్ ఇప్పిస్తానన్నాడు కాని నోరాకి దూరంగా వెళ్ళాలనే ఒకే ఒక్క కారణంగా వెళ్ళలేదు. మళ్ళీ యం.సెట్ రాస్తానని మా అమ్మవాళ్ళకి నచ్చచెప్పి మా ఊళ్ళోనే బియస్సీలో చేరాను. అప్పుడే మా మధ్యకి విలన్ ప్రవేశించింది."

"అంటే కాలమా?" రాజర్షి అడిగాడు.

"కాదు. మనోరమ చెల్లెలు మంజుల. చిన్నప్పటినించి ఆ అమ్మాయి మంచిది కాదు. ఎవరైనా నవ్వుతూంటే భరించలేకపోయేది. నోరా తనకంటే అందగత్తె అని, చదువులో క్లెవరని మంజుకి బాగా అసూయ. నాలాంటి ఆరాధకుడు కూడా తనకి లేడని బాధ. చిన్నప్పుడే తన మీద చాడీలు చెప్పి తిట్టించేది. పెద్దయ్యాక ఆ బుద్ధులు ఎక్కడికి పోతాయి? ఓ

రోజు వాళ్ళ నాయనమ్మ, మేనత్తా వచ్చినప్పుడు అందరిముందు నోరా, నేను ప్రేమించుకుంటున్నామని చెప్పింది. ఆ విస్ఫోటనానికి ఫలితం మేమిద్దరం అనుభవించాం" శిరోమణి కళ్ళు తుడుచుకున్నాడు.

"మనోరమ నానమ్మ, నాన్న, మేనత్త ముగ్గురూ ముందు నోరాని, తర్వాత పిల్లల్ని పెంచడం రాదని వాళ్ళమ్మని మాటలతో చీల్చిచెండాడారు. మనోరమ  స్కూల్‌కి వెళ్ళక్కర్లేదని తీర్మానించారు. తనెంత ఏడ్చినా వాళ్ళ నాన్న మూర్ఖంగా వినలేదు. తనని బయటకి రానివ్వకుండా కట్టడి చేసారు. వాళ్ళ తమ్ముడు నాకిందంతా చెప్పి, 'రాణికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు మణీ. అది ఒకటే ఏడుపు. దానివల్ల తనకి చెడ్డపేరు వచ్చిందని మా అమ్మకూడా రాణితో మాట్లాడడంలేదు. అంతా మంజూ మూలంగానే' అని బాధపడ్డాడు. రాణి మనోరమ కష్టాన్ని తల్చుకుంటే నా గుండె నీరయింది. పేరులోనే రాణి, చిన్నప్పటినించి అంతా దాసిగానే చూసేవారు. ఇప్పుడు ఈ అభాండం. వాడిని బతిమాలి మనోరమకి ధైర్యం చెప్తూ ఉత్తరం రాసిచ్చాను. అందులో తనని ధైర్యంగా ఉండమని, చదువులేని పిల్లలకి ఈరోజుల్లో పెళ్ళి కావడం కష్టమని, ఇంకో రెండేళ్ళు ఓపిక పడితే డిగ్రీ కంప్లీట్ చేసి, ఏదో ఉద్యోగం చూసుకుని తనని ఇంట్లోంచి తీసుకెళ్తానని రాసాను. తను అలా చేస్తే వాళ్ళ నాన్న అభిమానంతో ఉరిపోసుకుంటాడని, మంజులకి పెళ్ళి  కావడం కష్టమని, ఈ జన్మలో మన పెళ్ళికాదని రిప్లై రాసింది. ఇండియాలో కులవ్యవస్థ ఎంత బలంగా ఉందో అప్పుడు నాకు  అర్ధమైంది. జరగని విషయంకోసం తననింకా బాధపెట్టడం సరికాదనిపించింది. వెంటనే హైదరాబాద్ వచ్చి మా బాబాయ్ చెప్పిన కాలేజ్‌లో ఇంజనీరింగ్‌లో చేరాను. ఆ తర్వాత నేను మళ్ళీ మా ఊరు వెళ్ళలేదు. నేను టి.సి తీసుకుని వెళ్ళిపోయానని తెలిసాక వాళ్ళు మనోరమని యధాప్రకారం చదువుకోడానికి పంపారు. తను డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉండగా వాళ్ళ మేనత్త చూసిన సంబంధం ఒకటి కుదిరేలా ఉందని, అబ్బాయి బుద్ధిమంతుడని మా ఎదురింటివాళ్ళు ఫోన్ చేసి చెప్పారు" శిరోమణి గుండెమీద బాధగా రుద్దుకుంటూ చెప్పాడు.

"ఆ మాట విన్నాక కూడా నేనింకా ఎలా బతికున్నానో నాకు అర్ధంకాలేదు. తన పెళ్ళని తెలిసాక ఎంత ఏడ్చానంటే, మా నాన్నపోయినప్పుడు కూడా అంత ఏడవలేదు. నోరా నా గుండెల్లో వేసిన ముద్ర బలమైంది. తన స్పర్శ నాకు తెలీకపోవచ్చుకాని తననించి వచ్చే పరిమళాన్ని నేను ఆస్వాదించాను. తను నడిచిన నేలమీద నేను నడిచాను. ఇద్దరం ఒకే ఊపిరిగా జీవించాం. అది కొద్దికాలమైనా ఈ జీవితానికి చాలు అనిపించింది. దాంతో నేను పెళ్ళి చేసుకోలేదు. నోరా కోసమే ఈ దేహం, ఈ ప్రేమ అనుకున్నాను. మరొకరికి ఇవ్వబుద్ధికాలేదు. దేవత ప్రసాదం వద్దంటే దాన్ని కుక్కలకి వేయలేంగా.

శిరోమణి తన హృదయాన్ని వేలితో చూపిస్తూ చెప్పాడు. ఆ అమాయక దేవత జీవితం హాయిగా సాగుతుందనే ఆశిస్తాను. అంత బంగారు బొమ్మని బాధించాలని కర్కోటకుడు కూడా అనుకోలేడులే. తను బానే ఉండి ఉంటుంది. పెళ్ళని పెద్దవాళ్ళ గోల భరించలేక ఆర్మీలో చేరిపోయా. తర్వాత అమ్మకూడా పోయింది. ఇక నా గురించి పట్టించుకునే వాళ్ళు

లేకుండా పోయారు. హేపీగా ఏక్ నిరంజన్ అని బతుకుతున్నా" శిరోమణి నవ్వాడు. ఆ నవ్వులోని వెలితిని ఆనంద్ అర్థం చేసుకున్నాడు.

"నిజంగా ఆ అమ్మాయిని తాకలేదా గురూ? కిస్సులు, హగ్గులు కూడా లేని ప్రేమకోసం నువ్వు బ్రహ్మచారిగా ఉండిపోయావా? నీ అంత ఫూల్ నువ్వే" మందు తలకెక్కిన రాజర్షి నిరసనగా చెప్పాడు.

"అది నీలాంటి వాళ్ళకి అర్థం కాదులే. నోరా చిటికెన వేలిని కూడా తాకకపోయినా నా హృదయం నిండా తనే ఉంది. అది తనకి తెలీకపోవచ్చు. తనలా నేను కూడా ఎవర్నో పెళ్ళి చేసుకున్నాను అనుకోవచ్చు. ఇంకా నాకు తనమీద ఉన్న ప్రేమ తనకి నామీద లేకపోవచ్చు. అసలు శిరోమణి అనే వాడినే మర్చిపోయి ఉండచ్చు. ఏదైనా సాధ్యమే. ఎవరి పిచ్చి వారికానందం. నా పిచ్చి వల్ల ఎవరికీ ఇబ్బంది లేదుగా" శిరోమణి తన గ్లాస్‌లోది పూర్తిచేసాడు.

రాజర్షి కూడా తాగేసి లేచి చెప్పాడు.

"వెళ్ళొస్తా గురూ. థాంక్స్."

అతను వెళ్ళాక ఆనంద్ సందిగ్ధంగా అడిగాడు.

"అంటే మంజుల మంచిది కాదన్నమాట!"

"పాము. స్వంత అక్కమీదే అసూయ పెంచుకుంది. తనకి నోరాలాంటి బాహ్య సౌందర్యమేకాదు. అంతఃసౌందర్యం కూడా లేదు. వాళ్ళమ్మే ఎన్నోసార్లు అనేది. 'అది రాణీలాగా బంగారు తల్లికాదు. వాళ్ళ నాయనమ్మ పోలిక. మనిషికి ఈర్ష్య, కక్ష, కావేషాలు ఎక్కువ' అని. ఆ ఈర్ష్యతోనే మా గురించి పెద్దవాళ్ళకి ఉన్నవి లేనివి చెప్పింది. నోరా అంటే మంజులకి అకారణ ద్వేషం" శిరోమణి చెప్పాడు.

"నేనింక వెళ్తాను. డ్రైవ్ చేయాలి కదా. ఇంక తాగలేను. ఏమీ అనుకోకండి" చెప్పి ఆనంద్ తన గ్లాస్‌లో సగానికి పైనే మిగిలున్న ద్రవాన్ని పక్కనున్న మొక్కల్లో పోసి లేచాడు.

"థాంక్స్ ఆనందూ. సరదా కబుర్లు చెప్పుకుందామని పిలిచా. శిరోమణి ప్రేమగోలే సరిపోయింది. బోర్ కొడితే సారీ" మహేష్ చెప్పాడు.

"లేదు. బోరేం లేదు. వస్తాను శిరోమణిగారూ" ఆనంద్ వెళ్ళిపోయాడు.

మిత్రులిద్దరూ మిగిలారు.

"ఆనంద్ మారతాడంటావా?" శిరోమణి సందిగ్ధంగా అడిగాడు.

"మారచ్చు బావా, మొన్న మొన్నటివరకు రాణీతో బానే ఉన్నాడు. లాస్టియర్ సంక్రాంతికి వాళ్ళ ఊరు వెళ్ళొచ్చినప్పటినించి ఆమెకి నరకం చూపిస్తున్నాడు. ఎన్నోసార్లు మా ఆవిడ రాణి ఒంటిమీద దెబ్బల్ని చూసిందిట. నిలదీస్తే తనకి పెళ్ళికాకముందు ఎవరితోనో ఎఫైర్ ఉందని ఆనంద్‌కి తెలిసిందిట. సెకండ్ హేండ్ పెళ్ళాం నాకొద్దు అని మోసగత్తె

అని, తిరుగుబోతని రోజుకో వంక పెట్టుకుని కొడుతున్నాడట. తర్వాత వాళ్ళ తమ్ముడూ చెప్పాడట, మంజులే ఆ విషయం ఆనంద్‌కి చెప్పిందని. మంజుల భర్తకన్నా ఆనంద్ అందగాడు, సంపాదనా పరుడూ అవడం తట్టుకోలేక చెప్పిందిట. ఆ సంగతి తెలిసి వాళ్ళ పేరెంట్స్ ఆమెని గట్టిగా కోప్పడ్డారుట. కాని జరగాల్సిన అపాయం జరిగిపోయింది. ఆ అమ్మాయి ప్రేమించింది నిన్నే కాబట్టి నీకు చెప్పాను. కాని భలే పరిష్కరించావు బావా సమస్య" మహేష్ మెచ్చుకున్నాడు.

"నేను చెప్పినవన్నీ నిజాలే మహేషూ. మీ చెల్లెలితో నా పెళ్ళి తప్ప" శిరోమణి చెప్పాడు.

"అవును. పెళ్ళికి ముందే చెప్పావుగా. పద ఇంక బయల్దేరదాం" మహేష్ టేబుల్ సర్దేసాడు.

శిరోమణి గదిలోకి వెళ్ళాక భార్యకి ఫోన్ చేసాడు.

"ఎలా జరిగింది సమావేశం? రాణి భర్త వచ్చాడా?" ఆమె అవతలనించి అడిగింది.

"వచ్చాడు. రాడేమో? వచ్చేదాకా ఇక్కడే ఉండాలి అనుకున్నా. ఒక్కరోజులో పని పూర్తయిపోయింది. రేపు బయల్దేరతా"చెప్పాడు.

వారం తర్వాత ఓ రాత్రి మహేష్ నించి ఫోన్ వచ్చింది.

"నువ్వు సూపర్ బావా. ఆనంద్, రాణి మళ్ళీ చిలకా గోరింకల్లా ఉన్నారు. జరిగిన సంగతులులేవీ రాణీకి చెప్పొద్దని మా ఆవిడకి గట్టిగా చెప్పా. ప్రపంచం ఎంత చిన్నది బావా. ఇంత పెద్ద నగరంలో వాళ్ళు మా పక్కింట్లో ఉండడం ఏమిటో, చిన్నప్పుడు నేను చూసిన రాణి ఆనంద్ భార్యగా కనపడటమేమిటో" మహేష్ ఆశ్చర్యంగా చెప్పాడు.

"సరే. నువ్వు నా మేనత్త కొడుకువని, నేను నీ చెల్లెల్ని పెళ్ళి చేసుకున్నానని ఎవరితో అనకు. నోరా జీవితం చక్కబడినందుకు వెరీ హేపీ. పాపం ఇన్నాళ్ళు చేయని తప్పుకి శిక్ష అనుభవించింది" శిరోమణి చెప్పాడు.

"నిజమే బావా. ఇంత దూరం వచ్చి సమస్యని పరిష్కరించావు. నువ్వు గ్రేట్" చెప్పి మహేష్ లైన్ కట్ చేసాడు.

శిరోమణి పడకగదిలోకి వెళ్ళాడు. అతని భార్య వంటిల్లు సర్దుతోంది. బయట సన్నగా వర్షం కురుస్తోంది. చల్లగాలికి స్వల్పంగా వణికాడు. అతనికి అప్రయత్నంగా నోరా గుర్తొచ్చింది. ఆమె వెచ్చటి దేహం గుర్తొచ్చింది. తనని తమకంగా అల్లుకుపోయిన ఆమె స్పర్శ గుర్తొచ్చింది. తనకి ఉత్తేజాన్ని కలిగించే ఆమె గుండెల మధ్య వున్న పుట్టుమచ్చ గుర్తొచ్చింది.

ఆనంద్ ఎంత పిచ్చివాడు. పెళ్ళయ్యాక ఆమెతో సంతోషంగా కాపురం చేసాడు. ఆమె శీలం లేనిదని తెలిసాక హింసించాడు. తన మాటలు నమ్మి పతివ్రతని భావించి కాపురం చేస్తున్నాడు. ఉందో లేదో ఇతమిద్ధంగా తెలీని శీలం కోసం రాక్షసుడిలా మారాడు. చక్కటి సాయంత్రాలని, వెచ్చటి రాత్రులని పోగొట్టుకున్నాడు. నిజంగా నోరాకి శీలం ఉన్నా, లేకపోయినా అతనికి వచ్చిన నష్టమేంటి? ఉందని తెలిసాక వచ్చిన లాభమేంటి? నిజానికి అతను బాధ పడాల్సింది నోరా హృదయంలో తను లేడని. ఈ మనుషులంతా శరీరానికి ఇచ్చే విలువ మనసుకి ఇవ్వరెందుకో. అది తనకో అర్థంకాని ప్రశ్న.. శిరోమణి కిటికీ రెక్క మూస్తూ అనుకున్నాడు.

(వచ్చే సంచికలో మరో సరిగమ)

Click here to share your comments